క్లుప్తంగా

దోమల నివారణకు ఫాగింగ్



తాడికొండ: సీజనల్ వ్యాధుల నేపథ్యంలో తాడికొండ పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసులు రెడ్డి గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. చెరువులు, బావుల్లో క్లోరినేషన్ చేయిస్తున్నట్లు తెలిపారు.ఎక్కడైనా ఇబ్బందికర పరిస్థితులు, మురుగు నిల్వ ఉంటే పంచాయతీ కార్యాలయంలో తెలియజేయాలని స్థానికులకు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో గురువారం మాసశివరాత్రి సందర్భంగా విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులచే తొమ్మిదిమంది వేద పండితులు గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీ గణపతి, చండీ, రుద్ర హోమాలు నిర్వహించి, పూర్ణాహుతి చేశారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం పునరుద్ధరించాలి



గుంటూరు ఎడ్యుకేషన్: బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకాన్ని పునరుద్ధరిస్తామని యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీమేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే తగు చర్యలు చేపట్టాలని గిరిజన విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు కేతావతు పాండునాయక్ డిమాండ్ చేశారు. అరండల్‌పేటలోని రైల్వే ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో పాండునాయక్ మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో భాగంగా కారంపూడిలో నిర్వహించిన గిరిజనుల ముఖాముఖిలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీంను తిరిగి ప్రారంభిస్తామని లోకేష్ హామీ ఇచ్చారని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుత విద్యాసంవత్సరంలో పథకాన్ని పునఃప్రారంభించి, గిరిజన విద్యార్థులకు తోడ్పాటు అందించాలని కోరారు. తక్షణమే తగు చర్యలు తీసుకుని, గిరిజన విద్యార్థులు విద్యాసంవత్సరం నష్టపోకుండా చూడాలని డిమాండ్ చేశారు. నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీ నాయకుడు అయ్యస్వామి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసం.. రూ.10లక్షలు స్వాహా

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్ మోసంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొరిటెపాడుకు చెందిన హేమంత్‌కుమార్ టెలిగ్రామ్ యాప్‌లో టాస్క్ ఆపరేట్ చేశాడు. అందులో టాస్క్‌పెట్టి పూర్తి చేస్తే డబ్బులు ఇస్తామని చెబుతారు. టాస్క్ నిర్వాహకులు చెప్పిన విధంగా పలుమార్లుగా రూ. 10 లక్షలు చెల్లించాడు. మోసపోయినట్లు గుర్తించి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

14న 'ఏ షామ్ మస్తాని-15'

నగరంపాలెం: ఈనెల 14న గుంటూరు రాజాగారితోటలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సమర్పణలో గీతాంజలి ఆర్కెస్ట్రా గాయనీ, గాయకులతో ఏ షామ్ మస్తాని-15 నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ కార్యదర్శి పి.రామచంద్రరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత హిందీ సినీ గీతాలతో సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుందని, పాడుతా తీయగా గాయని శ్రీలలిత హాజరవుతారని అన్నారు. ఉచిత పాస్‌ల కోసం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలోగానీ, బ్రాడీపేట ఆర్కెస్ట్రా కార్యాలయంలో లేదా, 98483 65751 నంబరుకు సంప్రదించాలని ఆయన తెలిపారు.

బీసీజీ టీకాతో క్షయ వ్యాధి దూరం

తెనాలిరూరల్: అడల్ట్ బీసీజీ టీకాతో క్షయ వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చునని సంగం జాగర్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హనీఫ్ తెలిపారు. అంగలకుదురు సచివాలయం-2 పరిధిలో గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హనీఫ్ మాట్లాడుతూ బీసీజీ టీకా వేయించుకోవడం వలన భవిష్యత్తులో క్షయ వ్యాధిని అంతం చెయ్యవచ్చని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు సైతం వ్యాక్సిన్ వేయించుకోవచ్చని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ దగ్గర్లో ఉన్న సచివాలయంలో ఏఎన్ఎంను సంప్రదిస్తే బీసీజీ టీకా వేస్తారని చెప్పారు. తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ బీసీజీ టీకా వేయించుకోవడం వలన పెద్దవారికి 20 సంవత్సరాల వరకు క్షయవ్యాధి వచ్చే అవకాశం ఉండదన్నారు. ఏఎన్ఎం లక్ష్మీ, ఆశా కార్యకర్తలు సమాధానం, సునీత, అమూల్య, సచివాలయ సిబ్బంది, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరికి నివాళి



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శాఖాధిపతులు

తాడేపల్లి రూరల్ : అల్లూరి సీతారామరాజు 127వ జయంతి కార్యక్రమాన్ని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ డాక్టర్ ఎస్. ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఎంపీడీఓ రాఘవేంద్రనాథ్ మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో బెబ్బులిలా తెల్ల దొరలపై విరుచుకుపడిన సాయుధ పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఎ.రమేష్‌బాబు, డీఈ కృష్ణారెడ్డి, నగరపాలక సంస్థ శాఖాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి

ఫిరంగిపురం: స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు అని పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణమూర్తి అన్నారు. వేమవరం గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల హెచ్ఎం దీవి, కమల్ మోహన్, గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్యదర్శి రాధాకృష్ణమూర్తి

మహోజ్వల శక్తి సీతారామరాజు

తాడికొండ: భారత స్వాతంత్ర్య చరిత్రలో ఒక మహోజ్వల శక్తి అల్లూరి సీతారామరాజు అని, ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్యోద్యమంలో ఓ ప్రత్యేక అధ్యాయమని తాడికొండ, తుళ్ళూరు గ్రంథాలయాధికారులు టి.గిరిధర్ కుమార్, జి.శ్రీనివాసరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని ఆయా గ్రంథాలయాల్లో గురువారం నిర్వహించారు. అల్లూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. చిన్నారులకు చాక్లెట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మునసబు రంగారావు, పేరం రాంబాబు గ్రామస్తులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న గిరిధర్ కుమార్

ఘనంగా కొణిజేటి రోశయ్య జయంతి



రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

తాడేపల్లి రూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్య 91వ జయంతిని గురువారం దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని గ్రామంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు అన్నవరపు సత్యనారాయణ మాట్లాడుతూ 1933 జూలై 4న జన్మించిన కొణిజేటి రోశయ్య గుంటూరు హిందూ కళాశాలలో కామర్స్ అభ్యసించారన్నారు. కాంగ్రెస్ పార్టీ తరుపున 1968, 1974, 1980లలో శాసన మండలి సభ్యులుగా ఎన్నికయ్యారని, మర్రిచెన్నారెడ్డి ప్రభుత్వంలో రోడ్లు, రహదార్ల శాఖ, రవాణా శాఖల మంత్రిగా పనిచేశారని తెలిపారు. 2009 సెప్టెంబర్ 2 నుంచి 2010 నవంబర్ 24 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మాజీ గవర్నర్‌గా సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు, రోశయ్య అభిమానులు పాల్గొన్నారు.

మానికొండ సూర్యవతికి ఘన నివాళి

తాడేపల్లి రూరల్ : మహిళా ఉద్యమ నాయకురాలు మానికొండ సూర్యవతి 31వ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఎంటీఎంసీ పరిధిలోని కేబీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. కె. సరోజని అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి సూర్యవతి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సూర్యవతి చిన్నతనం నుంచి కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాల పట్ల అకర్షితురాలై.. భర్త మానికొండ సుబ్బారావు సహకారంతో అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. నందమూరు సర్పంచ్‌గాను, ఉంగుటూరు మండల అధ్యక్షురాలిగాను ప్రజలకు సేవలు అందించారని గుర్తుచేశారు. ఉంగుటూరు మండలంలో 18 వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించి, ఆనాటి జిల్లా కలెక్టర్‌తో ఉత్తమ ప్రజా ప్రతినిధిగా ప్రశంసలు పొందారని తెలిపారు. భూస్వామి కుటుంబంలో జన్మించినప్పటికీ అట్టడుగు వర్గాల పేదలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడడమే కాకుండా సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు జి. అమలాశ్రీ, శ్రీదేవి, కృష్ణ తులసి పాల్గొన్నారు.

వైద్యాధికారి వేధింపులు అరికట్టాలని వినతి

గుంటూరు మెడికల్: మున్నంగి పీహెచ్‌సీలో పనిచేస్తున్న సచివాలయం హెల్త్ సెక్రటరీలపై పీహెచ్‌సీ వైద్యాధికారి వేధింపులను అరికట్టాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. గర్భిణులను కాన్పుకు ఆసుపత్రికి తీసుకు వెళ్లినప్పుడు గర్భిణితోపాటు ఏఎన్ఎంలు కూడా ఆసుపత్రిలోనే ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఆదేశించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అందుకు నిరాకరించిన ఏఎన్ఎంలపై వేధింపులకు పాల్పడుతున్నారని, వేధింపులు భరించలేక ఆశాజ్యోతి అనే హెల్త్ సెక్రటరీ ఆసుపత్రి పాలయ్యారని పేర్కొన్నారు. వైద్యాధికారి ఏఎన్ఎంలను దుర్భాషలాడుతున్నారని, రాత్రి పొద్దుపోయే వరకు సమావేశాల పేరుతో పీహెచ్‌సీలోనే ఉంచుతున్నారని, సెలవులు ఇతర అవసరాల కోసం వైద్యాధికారి వద్దకు వెళ్లినప్పుడు గంటల తరబడి పీహెచ్‌సీలో నిలబెడుతున్నారని ఏఎన్ఎంలు వాపోయారు. దీనిపై స్పందించిన డాక్టర్ కొర్రా విజయలక్ష్మి హైరిస్క్ కేసులు ఉన్నప్పుడు సూపర్‌వైజర్లు, ఆ పై స్థాయి సిబ్బంది మాత్రమే ఆసుపత్రికి వెళ్లాలని చెప్పారు. సాధారణ కేసులకు ఏఎన్ఎంలు ఆసుపత్రికి వెళ్లి వారిని ఆసుపత్రిలో చేర్చాలని, ఆసుపత్రిలో ఉండాల్సిన అవసరం లేదన్నారు. ఇందుకు భిన్నంగా వైద్యాధికారులు ఆదేశాలిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, ఏపీ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.అన్నమ్మ, యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ నాయకులు జె.శ్యామ్ తదితరులున్నారు.

జీఓ నంబరు 36 మేరకు వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విలీనమైన గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులకు, గత ఆరు నెలలుగా జీఓ నంబరు 36 ప్రకారం చెల్లించాల్సిన రూ.21 వేలను వెంటనే చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేబీ భవన్‌లో తాడేపల్లి మండల మున్సిపల్ వర్కర్స్ సమావేశం సంఘం మండలాధ్యక్షుడు చొక్కా మరియదాసు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమా మహేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగిస్తూ ఎంటీఎంసీలో విలీనమైన గ్రామాల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం వేతనాలు అందడం లేదని, మున్సిపల్ వర్కర్స్‌కు ఈఎస్ఐ, పీఎఫ్ కార్డులు ఇవ్వలేదని తెలిపారు. వెంటనే అధికారులు ఈ రెండు కార్డులను అందజేయాలని కోరారు. వారాంతపు సెలవులు, క్యాజువల్ లీవ్స్ సక్రమంగా అమలు చేయాలని అన్నారు. తాడేపల్లి కార్పొరేషన్ మున్సిపల్ వర్కర్స్ కార్యదర్శి ఎస్.ఎస్. చెంగయ్య మాట్లాడుతూ కార్మికులందూ ఐక్యంగా నిలబడి, సమస్యల పరిష్కారం అయ్యేందుకు కృషి చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, మున్సిపల్ కార్మికులు ప్రసన్న, పి. మరియమ్మ, ప్రశాంత్, జోజిబాబు, సరోజని, కృష్ణ తులసి పాల్గొన్నారు.

సీసీఆర్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శ్రీరంజని

పెదపరిమి(తాడికొండ): కౌలు పొలం సాగు చేసే రైతులు సీసీఆర్‌సీ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని తుళ్లూరు మండల వ్యవసాయాధికారిణి కె.శ్రీ రంజని అన్నారు. మండలంలోని పెదపరిమి గ్రామంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో రైతులతో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీసీఆర్‌సీ కార్డులు కలిగి ఉన్న రైతులకు రాయితీపై ఎరువులు, విత్తనాలు అందించడంతో పాటు పంట నష్టం కలిగినపుడు బీమా లేదా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట ఉత్పత్తుల అమ్మకం మొదలైన లాభాలు ఉంటాయన్నారు. అందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులు సాగుచేస్తున్న పొలం పాస్ బుక్ జిరాక్స్, కౌలు చేసే రైతు ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ ఫోటోలతో వీఆర్‌వో లేదా రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సాంబశివరావు, స్థానిక నాయకులు పుట్టి రామచంద్రరావు, పోతుగుంట్ల నరసయ్య, చంద్ర గణేష్, నూతలపాటు శ్రీనివాస్, తాడిబోయిన సాంబశివరావు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి

డీఈఓ, ఆర్జేడీలకు ఏపీటీఎఫ్ వినతి



డీఈఓ శైలజకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు డిమాండ్ చేశారు. ఈమేరకు ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా నాయకులు గురువారం డీఈఓ పి.శైలజ, ఆర్జేడీ బి.లింగేశ్వర రెడ్డిని కలిసి ఉపాధ్యాయ సమస్యలతో కూడిన వినతి పత్రాలు సమర్పించారు. బసవ లింగారావు మాట్లాడుతూ 2023, 2024 సంవత్సరాల్లో వేసవి సెలవులో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు, దూరవిద్య టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణ, సార్వత్రిక ఎన్నికల విధులతో పాటు మనబడి నాడు-నేడు విధులు నిర్వహించిన ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయులకు సంపాధిత సెలవులు నిబంధనలు మేరకు ప్రిజర్వ్ చేసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. 1995 నుంచి 2018 వరకు నిర్వహించిన వివిధ డీఎస్సీల అప్డేట్ సీనియారిటీ జాబితాలు ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంచాలని కోరారు. మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకుని, సర్వీస్ రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్ జరగని ఉపాధ్యాయులకు ఆయా కేడర్లలో సర్వీస్ రెగ్యులరైజేషన్ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయుల నెలవారీ పదోన్నతులను పునరుద్ధరించి ఖాళీలను భర్తీ చేయాలన్నారు. విద్యాశాఖ కార్యాలయంలో సిటిజన్ జాబ్ చార్ట్ అమలు చేయాలని పేర్కొన్నారు. అదే విధంగా పాఠశాలలు ప్రారంభమై 20 రోజులవుతున్నా ఇంకా విద్యార్థులకు కొన్ని సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలు అందలేదన్నారు. వెంటనే నూతన పాఠ్య పుస్తకాలు అందించాలని కోరారు. డీఈఓ, ఆర్జేడీలను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా ఉపాధ్యక్షులు పి.నాగశివన్నారాయణ, పి.లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శులు ఎస్.ఎస్.ఎస్.మూర్తి, పి.శ్రీను, జి.దాస్, జిల్లా కౌన్సిలర్లు బాలరాజు, శివరామకృష్ణ, నాగేశ్వరరావు, నరసింహారావు, భాస్కర్, సుబ్బారావు, మూర్తి తదితరులు ఉన్నారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్టు

గుంటూరు ఈస్ట్: బైకులు చోరీ చేసిన నిందితుడిని కొత్తపేట పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌హెచ్ఓ అన్వర్ బాషా వివరాల ప్రకారం పల్నాడు జిల్లాకు చెందిన ఎస్.విద్యాధర్ గుంటూరు నగరంలో ద్విచక్ర వాహనాలు చోరీ చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు విద్యాధర్‌ను గురువారం అరెస్టు చేసి, 8 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

- సికింద్రాబాదుకు చెందిన రమావత్ రవి గుంటూరు నగరంలో పలు చోరీలకు పాల్పడ్డాడు. పోలీసులు గురువారం అరెస్టు చేసి అతని నుంచి సెల్ ఫోన్, ల్యాప్‌టాప్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు.

కలెక్టర్ న్యాయం చేయాలి



ఫిరంగిపురం: గరుడాచలపాలెంలో గత ఎన్నికల ఫలితాల అనంతరం దళితులపై జరిగిన దాడి పరిణామాలపై పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీనిపై బుధవారం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి బాధితుడు, దళిత నాయకుడు జి.రాజసుందరబాబు ఆధ్వర్యంలో తమపై జరిగిన దాడిని గురించి వివరించారు. దీంతో గురువారం ఆర్డీవో ఆదేశాల మేరకు ప్రాథమిక విచారణ చేసేందుకు తహసీల్దారు రాఘవేంద్రరావు వెళ్లారు. దీంతో మహిళలు తమకు న్యాయం చేయాలని, కలెక్టర్, ఎస్పీ రావాలని, వారికే తమ సమస్యలు వివరిస్తామని చెప్పారు. అనంతరం న్యాయం కావాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

ప్రజా నాయకుడు వీఎం రంగా



వీఎం రంగా చిత్రపటానికి వేణుగోపాల సోమిరెడ్డి నివాళి



వడ్డేశ్వరం ఇప్పటం రోడ్డులో మొక్కలు నాటుతున్న జనసేన నాయకులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో, దుగ్గిరాల మండలంలో ప్రజా నాయకుడు, పేదల పెన్నిధి వంగవీటి మోహన రంగా 77వ జయంతిని రాజకీయ పార్టీలకు అతీతంగా నిర్వహించారు. పలుచోట్ల సేవా కార్యక్రమాలు చేపట్టారు. తాడేపల్లి వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో వంగవీటి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగా ఆశయాలు ఇంకా ప్రజల్లోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేసీఎస్ అధ్యక్షుడు డేవిడ్ రాజు, పట్టణ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి, సంపూర్ణ పార్వతి, వెంకటేశ్వరరావు, శ్రీనివాస మధు, దుర్గారావు, ప్రకాష్, అనిల్, అంజిరెడ్డి, గంగాధర్, పెదగాలయ్య, సురేంద్ర, కల్యాణ్, ఎలీషా, సలాం, కిషోర్, శివ, మహేష్ రెడ్డి, నాగరాజు, జగదీష్, శ్యామ్ పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో

జనసేన రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు చిల్లపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో పలుచోట్ల వంగవీటి మోహన రంగా జయంతి కార్యక్రమాలు నిర్వహించి, కేక్‌కటింగ్ చేశారు. వడ్డేశ్వరం, ఇప్పటం రోడ్డులో మొక్కలు నాటి జనసేన నాయకులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు తిరుపతిరావు, వాసా శ్రీనివాసరావు, విజయ శేఖర్ పాల్గొన్నారు.

మారుతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో

మారుతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జంగాల సాంబశివరావు, జంగాల వెంకటేష్ ఆధ్వర్యంలో ఉండవల్లిలో వంగవీటి మోహనరంగా జయంతి కార్యక్రమం నిర్వహించారు. దుగ్గిరాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో రంగా జయంతి కార్యక్రమాలు నిర్వహించారు.

రంగా విగ్రహం ఏర్పాటు చేయాలని వినతి

ఉండవల్లి సెంటర్ నాలుగు రోడ్ల కూడలిలో రోడ్ల విస్తరణలో భాగంగా ప్రజా నాయకుడు వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని తొలగించారని, ఆ విగ్రహాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని కాపు జాగృతి మంగళగిరి నియోజకవర్గ నాయకుడు జొన్న రాజేష్ మంత్రి నారా లోకేష్‌కు, జనసేన చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చిల్లపల్లి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. కాపు జాగృతి నాయకులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం



కళాశాల బస్సును ఆపి నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ సభ్యులు

తాడేపల్లిరూరల్ : నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బంద్ విజయవంతమైనట్లు ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్, కో-కన్వీనర్ వై.శివ గోపి, మత్తె అభిషేక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయి పరీక్షలు నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, తీవ్ర అవకతవకలు, వ్యత్యాసాలతో బాధ్యతరాహిత్యంగా పరీక్షలు నిర్వహించారని విమర్శించారు. నీట్ స్కాంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ డిపో రోడ్ వద్ద, విట్, ఎస్ఆర్ఎం, ఎన్నారై, ఎస్ఆర్‌కే కాలేజీ బస్సులను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశామన్నారు. మంగళగిరి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి స్కూల్స్, కాలేజీల విద్యార్థులను బంద్‌లో పాల్గొని, సహకరించాలని కోరినట్లు తెలిపారు. ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన పాలసీల కారణంగా ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గించడం జరిగిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక పద్ధతిలో అయినా టీచర్ల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులు నియంత్రణ చట్టం చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షులు హానోక్ బాబు, అజయ్, వై.మణికంఠ, ఎ.వంశీ, మణి, ఎస్ఎఫ్ఐ నాయకులు సమీర్ అలీ ఖాన్, వెంకట్, సాయి, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

కరిష్మా మృతిపై సమగ్రంగా విచారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ సుభాని

తాడేపల్లిరూరల్ : విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌లో మదర్సాలో అనుమానాస్పదంగా మారిన ముస్లిం విద్యార్థిని కరిష్మా మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి, వెంటనే న్యాయం చేయాలని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకుడు షేక్ సుభాని కోరారు. గురువారం దుగ్గిరాల ముర్తుజా నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరిష్మా తల్లిదండ్రులు ఆమె మృతి వెనుక ఏదో పెద్ద కారణం ఉందని అనుమానం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కరిష్మా మరణానికి కారణం దాచేందుకు మదర్సా వాళ్లు ఫుడ్ పాయిజన్ అంటూ కేసును తప్పుదోవ పట్టిస్తున్నట్లుగా ఆరోపణలు చేశారన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ జాను సాహెబ్, షేక్ జాన్ సైదా పాల్గొన్నారు.

పోలీసులతో మందుబాబులు దాగుడుమూతలు



కర్మకాండల భవనం వద్ద గస్తీకి వచ్చిన కానిస్టేబుళ్లు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మందుబాబులు పోలీసులతో దోబూచులాడుతూ ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రోడ్లపై హల్ చేయడం, దాడులకు పాల్పడడంతో సీఐ కల్యాణ్ రాజు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో మొబైల్ గస్తీ నిర్వహించారు. ఈ క్రమంలో తాడేపల్లి పశువుల హాస్పిటల్ వద్ద ఉన్న కర్మకాండల భవనంలో మందు బాబులు హల్‌చల్ చేస్తున్నారంటూ స్థానికులు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులను చూసి మందు బాబులు పరారయ్యారు. పోలీసులు అక్కడి నుంచి వెళ్లడంతో మళ్లీ అక్కడే తిష్ట వేశారు. మద్యం సేవిస్తూ బకింగ్ హామ్ కెనాల్‌లో దస్తులు ఉతుక్కోవడానికి వచ్చే మహిళలను వేధించారు. విషయం తెలుసుకున్న పోలీసులు మళ్లీ ఘటనా స్థలానికి వెళ్లేటప్పటికి అక్కడి నుంచి ఉడాయించారు. విచారణ చేసినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. పోలీసులు మఫ్టీలో నిఘా ఏర్పాటు చేస్తే తప్ప ఆకతాయిలు దొరకరని పలువురు అంటున్నారు.

కొండా శ్రీనివాసరెడ్డి కుటుంబానికి అండ



నగదు చెక్కు అందజేస్తున్న దయాసాగర్

తాడికొండ: మండల పరిధిలోని తాతిరెడ్డిపాలెం గ్రామంలో మార్చి 14న లిఫ్ట్ ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్ కొండా శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రూ.5 లక్షలు ప్రమాద బీమా ఇచ్చారు. గురువారం సాయంత్రం గుంటూరు కార్యాలయంలో కొండా శ్రీనివాసరెడ్డి కుమారుడు నాగ మల్లేశ్వరరెడ్డి మేకతోటి దయసాగర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ చేసిన ప్రమాద బీమాను త్వరగా మంజూరు చేయించి నందుకు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మేకతోటి సుచరిత, వైఎస్సార్ సీపీకి కృతజ్ఞతలు తెలిపారు. తాడికొండ మండల జేసీఎస్ కన్వీనర్ తాళ్ళా శ్రీనివాసరెడ్డి, మాదాను సురేష్, షేక్ జానీ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com